# మంచి మనసులు

-సి హెచ్. వి. ఎస్. బ్రహ్మానందరావు

**రా**మారావుగారు నాలుగు దశాబ్దాలుగా ఉపాధ్యాయునిగా సేవచేసి క్రితంరోజు పదవీ విరమణ చేశారు. ఆయన దగ్గర విద్య నేర్చుకున్న ఎందరో శిష్యులు అత్యున్నత స్థాయిలో ఉన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రామారావుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో ఘన సన్మానం చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు పలుసార్లు ఆయనను సన్మానించారు. ఆయన కేవలం ఉపాధ్యాయునిగా సేవలందించడం కాక విద్యార్థినీ, విద్యార్థులకు ఆటల్లోను, పాటల్లోనూ, ఏకపాత్రాభినయంలోనూ శిక్షణ ఇచ్చి పోటీలకు పంపేవారు. వాళ్ళు బహుమతులు తీసుకొస్తే సంతోషంగా అభినందించేవారు. అంతేకాక ఏ ఉపాధ్యాయునికి ఏ సమస్య వచ్చినా దానికి సంబంధించిన అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడంలో సాయపడేవారు. క్రితంరోజు స్కూలులో ఉపాధ్యాయులు, అధికారులు, రాజకీయ నాయకులు, విద్యార్థినీ విద్యార్థులతో పాటు అనేక సంఘాల నాయకులు కూడా ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

ఉదయం ఆరు గంటలకు అలారం మోగడంతో మెలుకువ వచ్చిన రామారావు లేచి బట్టలు మార్చుకుని వాకింగ్‌కు వెళ్ళారు. సరిగ్గా ఏడు గంటలకు ఇంటికి వచ్చిన రామారావుని–

"శుభోదయం నాన్నగారు!" అంటూ నవ్వుతూ పలకరించాడు ఆనంద్.

రామారావుగారు కూడా నవ్వుతూ ఆనంద్ ఇచ్చిన పేపర్ అందుకుని పేజీలు తిరగేస్తున్నాడు.

"ఏవండీ! మీరెలాగూ ఇంట్లోనే ఉంటారుగదా! పేపర్ ఎప్పుడైనా చదువుకోవచ్చు. ఆ పేపర్ అబ్బాయికి ఇవ్వండి" అంది పార్వతి.

"నిజమేరా! నువు చదివాక చూస్తాలే!" అని పేపర్ ఇచ్చి వెళ్ళాడు.

"పార్వతీ! స్నానానికి నీళ్ళు పెట్టు" అన్నాడు.

"అబ్బా! మీకంతా తొందరే. ఇప్పుడే స్నానం చేసి మీరు చేసే రాచకార్యాలు ఏమున్నాయ్? అబ్బాయి ఆఫీసుకెళ్ళాలి. వాడు చేశాక చేద్దురుగాని" అంది.

దినచర్యలో వస్తున్న మార్పులకి నవ్వుకుంటూ గదిలోకి వెళుతుంటే...

"మావయ్యగారు! పిల్లల్ని స్కూల్లో దింపడానికి రిక్షా అబ్బాయి రాలేదు. మీరెళ్ళి దింపిరాకూడదు! ఎలాగూ 'ఖాళీ'నే గదా..." అంది కోడలు లక్ష్మి.

అంతా బాగానే ఉంది కానీ చివర్లో 'ఖాళీ' అన్న పదమే ఆయనకు మింగుడు పడలేదు.

"అలాగేనమ్మా! పిల్లల్ని రెడీ చెయ్యి" అన్నాడు.

పిల్లల్ని స్కూలుకు తీసికెళుతుంటే ప్రకాశం ఎదురుపడ్డారు.

"నమస్కారం మాస్టారు! నిన్ననే రిటైర్ అయ్యారుటగా! అభినందన సభ బాగా జరిగిందని అందరూ చెప్పారు. పేపర్లో కూడా చూశాను. సారీ మాస్టారూ! వేరే అత్యవసర పనుండి రాలేకపోయాను. ఏమీ అనుకోకండి" అన్నారు.

"భలేవారే! ఇందులో అనుకోవడానికేం ఉంది. మీకు నా మీద ఉన్న అభిమానం గురించి నాకు తెలియదా!" అన్నారు.

"ఏమిటో రావుగారు! రిటైర్‌మెంట్ అంటే సంబరపడతాం గాని.. మనిషికి ఒకవిధంగా 'శాపం' గదండి! మనకున్న కొద్దిపాటి ఆనందాన్ని హరించేదే ఈ పదవీ విరమణ. ఉద్యోగంలో ఉన్నప్పుడు మనకి సర్వాధికారాలతో పాటు ఎంతో స్వేచ్ఛ కూడా ఉంటుంది. ఒకవిధంగా రిటైర్మెంట్ అంటే పంజరంలో చిలుక లాంటిది. కాకపోతే దానికి పనులుండవు. వేళకి ఆహారం ఉంటుది. మనం పనులు మాత్రం చేస్తుండాలి. ఇక భోజనం ఇంట్లో వాళ్ళ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. సారీ! మాటల్లో పడి మీ సమయాన్ని వృధా చేసినట్లున్నాను"

"అలాంటిదేం లేదులెండి! వస్తాను. మనం తర్వాత కలుద్దాం" అన్నారు.

"పదండ్రా! స్కూలుకి టైం అవుతోంది" అని వేగంగా అడుగులు వేస్తుంటే పిల్లలు ఆయన్ను అనుసరించారు.

పిల్లల్ని స్కూల్లో దింపి ఇంటికొచ్చేసరికి తొమ్మిదయింది. ఒళ్ళంతా చెమట్లు పట్టి చిరాగ్గా ఉండేసరికి... బట్టలు మార్చుకుని టవల్ తీసుకుని స్నానానికెళ్ళారు.

వేడినీళ్ళు పెట్టమంటే భార్య మళ్ళీ ఏమన్నా

అంటుందేమోనని చన్నీళ్ళతోనే స్నానంచేసి బయట కొచ్చి బట్టలు వేసుకుంటుంటే...

"ఏమిటండి! ఏనాడూ లేంది చన్నీళ్ళ స్నానం... వేడినీళ్ళు పెట్టమని అడగొచ్చుగా"

ఆయన ఏమీ మాట్లాడలేదు.

"రండి! టిఫిన్ చేద్దురుగాని" అంది.

డైనింగ్ టేబుల్ దగ్గరకెళ్ళి కుర్చీలో కూర్చుని పార్వతి కోసం ఎదురు చూస్తున్నారు. పావుగంటవుతున్నా ఎవరూ వస్తున్న ఛాయలు కనిపించకపోవడంతో...

"పార్వతి" అని పిలిచారు.

"ఆ! వస్తున్నానండి. పనిలో ఉన్నాను. మీలాగా నా ఉద్యోగానికి రిటైర్‌మెంట్ ఉండదుగా" అంది నవ్వుతూ.

"అంటే! నేను 'ఖాళీ'గానే ఉన్నానని చెప్పిపోదుస్తున్నావా!"

"లేదండి! ఊరికే సరదాగా అన్నాను. చెప్పండి! ఏం కావాలి. అవును, ఏంటి, పల్లెం అలా పెట్టుకు కూర్చున్నారు. అన్నీ టేబుల్ మీదే ఉన్నాయిగదండీ"

"పార్వతి! మన పెళ్ళయిన 35 ఏళ్ళలో ఏ ఒక్క రోజన్నా నువ్వు పక్కన లేకుండా టిఫిన్ గాని, భోజనం గాని చేశానా?"

"భలేవారే! అలవాటు చేసుకోవాలి. నిదానంగా చూసి పెట్టుకు తినండి. అవతల వంట పూర్తికాలేదు. అబ్బాయికి ఆఫీసుకు టైం అవుతోంది. క్యారేజీ కట్టాలి" అని వెళ్ళారు.

రిటైర్‌మెంట్ మనిషికి వరం కాదు శాపం అని ప్రకాశంగారు ఎందుకు అన్నారో ఇప్పుడు అర్థం అవుతుంది. రిటైరై 24 గంటలు కాలేదు. ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముందు ముందు ఇంకెన్ని మార్పులొస్తాయో! రేపటి నుంచి పాల పాకెట్లకి, సూపర్‌బజార్లకి, రేషన్‌షాపులకు పంపిస్తారేమో! ఆరు నెలల క్రితం సూర్యనారాయణ గారిని కలవటానికెళితే, ఆయన హడావుడిగా బయటకొచ్చి-

"రండి! ఏమిటి అనుకోకుండా వచ్చారు. అలా పార్క్‌కి వెళ్ళి మాట్లాడుకుందాం"

"అదేమిటండీ! ఈ టైంలో పార్కుకెందుకు? ఇంట్లోనో కూర్చుని మాట్లాడుకోవచ్చుగదా!"

"ఆ విషయాలన్ని అక్కడ మాట్లాడుకుందాం! పదండి" అన్నారు.

ఇద్దరు పార్క్‌కెళ్ళి ఏకాంత ప్రదేశంలో కూర్చు

## హేమంతక్రాంతిలక్ష్మి!

చీకటికోణాల్ని చీల్చుకుని
వెలుగు రేఖల్ని పులుముకుని
పౌష్యమాసాన మకరరాశిలో
భానుడి ప్రవేశం సంరంభమైన ఆరంభం
అదే ఉత్తరాయణ పుణ్యకాలం
బలిని వామనుడు పాతాళానికి
అణగతొక్కే కాలం
హిరణ్యాక్షుని నృసింహుడు
అంతమొందించిన కాలం
శ్రీకృష్ణుడు గోవర్ధనగిరినెత్తి
గోకులాన్ని సంరక్షించిన కాలం
శ్రీరంగనాథుడు గోదాదేవిని
అర్ధాంగిగా స్వీకరించిన కాలం
కాటమరాజు సోదరి
గొబ్బిగా అవతరించిన కాలం
పితృదేవతలకత్యంత / ప్రీతిపాత్రమైన కాలం
పశులకత్యంత వేడుకతో
పూజలందించే కాలం
హరినామ కీర్తనలతో
దాసు సృష్టిని మేలుకొలిపే కాలం
మగువలు ముంగిట
రంగవల్లులు తీర్చిదిద్దే కాలం
కూష్మాండముల విరివిగా
విప్రులకు దానమిడు కాలం
గంగిరెద్దు మేళగాళ్ళు / సందడిసేయు కాలం
మామిడి తోరణాలతో ప్రతిఇల్లూ కళకళలాడే కాలం
అత్తమామల ఇంటికొత్తల్లుళ్ళు కొలువుదీరే కాలం
ముత్తైదువలు పిల్లలకు భోగిపళ్ళు పోసే కాలం
పండుగల శోభతో స్వాగతమిదని నా వాకిట
వేంచేసిన కాలం
కడకు నా మదినెంతో రంజింపచేసి
మీకై ఈ భావుకతనందించి
ముదమందే జనులందర్నీ
వేడుకను ఘనంగా జరుపుకొమ్మంటూ
సాక్షాత్కరించిన హేమంత క్రాంతి లక్ష్మి
వెరసి పౌష్య హేమంత మకర సంక్రాంతి లక్ష్మిగా
ఈ భువిని సదా నిలిచిన కాలం

-దోసపాటి సత్యనారాయణ

న్నారు.

"ఇప్పుడు చెప్పండి! ఎందుకు అలా కంగారు పడుతూ ఇక్కడికి తీసుకొచ్చారు?" అన్నారు.

ఆయన బాధతో కూడిన నవ్వు నవ్వి...

"ఎందుకులెండి! చెప్పుకుంటే సిగ్గుచేటు" అన్నారు.

"ఏమిటండీ! హాయిగా కాలు మీద కాలేసుకుని ఎలాంటి వత్తిడికీ లోనుకాకుండా గడపడం కూడా కష్టమేనా? ఒకవిధంగా కష్టమే అనుకోండి! నాలుగు దశాబ్దాలుగా పిల్లల మధ్య గడిపి... ఒక్కసారిగా పని పాటా లేకుండా గడపాల్సి రావడం బాధాకరమే! అయినా ఇన్నేళ్ళు కష్టపడ్డందుకు ఎలాంటి ఆలోచనలు లేకుండా హాయిగా గడపటానికేగా ఉద్యోగం తర్వాత ఈ విశ్రాంతి"

## భ్రమరం-భ్రమ

రంగు రంగుల కోక కట్టుకున్న కుసుమం
ఆకర్షణీయంగా కనిపించింది భ్రమరానికి
గాలిలో కుసుమం ఊగుతూంటే
తననే కాబోలు పిలుస్తోందనుకుంది భ్రమరం
ఝూంకారంతో, వెళ్లివాలబోయింది భ్రమరం
కానీ.../ కుసుమం కెవ్వుమని అరచినట్లనిపించింది.
గుండెను ఎంతగా 'రాయి' చేసుకుందామనుకున్నా
చంచలం పోలేదు భ్రమరానికి-
ఇంతలో మరలా చల్ల చల్లని పిల్లగాలి!
ఆ పిల్లగాలికి తల్లడిల్లింది - కుసుమం!
మరలా తననే కవ్విస్తూ
ఆహ్వానిస్తోందనుకుంది భ్రమరం!
ఆలోచనలతో నిమగ్నమైయున్నా
ఎవరో పూవును తృంచివేసిన దృశ్యాన్ని
లీలగా పరికించింది భ్రమరం!
మనసు కుదుట పరచుకోలేక
సహించలేక
చివరకు పరుగెత్తిపోయింది భ్రమరం!
అక్కడ మరి కుసుమం లేదు.
అంతలోనే ఎవరికో అర్పితమైంది!
పాపం, తను పొందినదంతా
భ్రమ- అనుకొంది భ్రమరం.
నిరాశతో, నిస్పృహతో / తనలో తాను చిన్నబోయి
వెళ్లిపోయింది భ్రమరం!

-పి. సుధాకర్

"నిజమే! ఒడ్డున కూర్చుని నీటిలో మునిగిపోతున్న వాడికి సలహాలిస్తున్నట్లు ఉన్నాయి మీ మాటలు. ఇలా అంటున్నానని ఏమీ అనుకోండి! ప్రభుత్వం వారు 58 ఏళ్ళకి నువు పనికిరావు పో అని రిటైర్ చేసి ఇంటికి పంపుతారు. కాని ఇంటిలో మనవాళ్ళు మాత్రం నువు చేసే పనులు చాలా ఉన్నాయి. ఇది నీకు రెండో ఉద్యోగానికి అపాయింట్‌మెంట్ అని కొత్త ఉద్యోగం ఇస్తారు. అయితే ఈ ఉద్యోగానికి జీతం ఉండదు. స్వేచ్ఛ ఉండదు. పైగా అక్షింతలు. రిమార్కులు ఉంటాయి. ఇంకా మనం ఏమేం పనులు చేయాలో నిమిషానికోసారి గుర్తుచేస్తుంటారు కుటుంబ సభ్యులు. మనం ఉద్యోగం చేస్తూ ఫస్టుకి జీతం తెచ్చి ఇస్తేనే ఆప్యాయత, అభిమానం చూపిస్తారు. ఇంట్లో ఖాళీగా ఉన్నట్లు కనపడితే వాళ్ళు-

'నాన్నగారూ! అలా ఖాళీగా కూర్చోకపోతే సూపర్‌బజార్‌కెళ్ళి సరుకులు తేవచ్చుగదా!' అంటాడు మా పెద్దబ్బాయి.

'మావయ్యగారు! ఎలాగూ ఖాళీగా ఉన్నారుగదా! ఏమీ అనుకోకుండా డిపోకెళ్ళి పంచదార, మార్కెట్‌కెళ్ళి కూరగాయలు పట్టుకురండి' అంటుంది నా పెద్దకోడలు.

'షడన్‌గా గ్యాస్ అయిపోయింది. వెళ్ళి బండ తీసుకురండి' అంటుంది నా చిన్నకోడలు.

పనులన్నీ ఎలాగో చేస్తాను. కానీ ఉద్యోగంలో ఉన్నప్పుడు ఒకటికి నాలుగుసార్లు కాఫీ, టీలు తాగే అలవాటున్నవాళ్ళం గదా! నోరు తెరిచి అడిగితే... 'గంట గంటకీ టీలు ఇవ్వడానికి ఇదేం హోటల్ అనుకున్నారా' అంటారు. భోజనం కూడా నేనొక ప్రాణిని ఉన్నానని వాళ్ళకి గుర్తొచ్చినప్పుడు మాత్రం ఇంత ముద్ద పెడతారు. అడిగితే విసుక్కుంటారు. ఇదీ రిటైరయ్యాక నా జీవితం" అన్నారు ఆవేదనగా సూర్యనారాయణ.

"బాధపడకండి! ఇంకా నయం మీ పిల్లలు మిమ్మల్ని ఇంట్లోనైనా ఉండనిచ్చారు. ఇవాళ ఎక్కువ మంది తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు తరలిస్తున్నారు గదా" అనునయించాడు రామారావు.

"వాళ్ళు అదే ఆలోచనలో ఉన్నారు. కాకపోతే ఇల్లు నా పేరున ఉంది కదా. అందువలన బయటపడడం లేదు" అన్నాడు సూర్యనారాయణ.

అవన్నీ గుర్తుకురాగానే ముందు ముందు నా పరిస్థితీ అంతేనేమో అనుకున్నాడు రామారావు. మళ్ళీ

ఆ పరిస్థితి నాకెందుకు వస్తుంది అనుకుని తృప్తిపడ్డారు.

ఆలోచనలలోనే నిద్రలోకి జారుకున్నారు.

"మావయ్యగారు! భోజనానికి రండి" అంది కోడలు లక్ష్మి.

రామారావు లేని కాళ్ళు కడుక్కుని భోజనానికి వెళ్ళారు.

డైనింగ్ టేబుల్ దగ్గర పార్వతమ్మ దగ్గరుండి ఏమేం కావాలో అడిగి వడ్డించింది. తృప్తిగా భోజనం చేశారు.

"లక్ష్మి! మావయ్యకు పక్కవెయ్, కాసేపు విశ్రాంతి తీసుకుంటారు" అంది పార్వతమ్మ.

"అలాగే అత్తయ్యా" అంటూ బెడ్‌రూమ్‌లోకెళ్ళింది.

మంచం మీద పడుకున్నారన్నమాటే గాని ఆలోచనలు కందిరీగల్లా ముసురుతూనే ఉన్నాయి. నిజంగానే తన జీవితం ప్రకాశం, సూర్యనారాయణల్లా నరకం కాబోతుందా? నాకు కూడా పనుల మీద పనులు చెపుతూ... పనిచేసే యంత్రంలా మారుస్తారు. అయినా ఇంట్లో ఉంటేనేగా వీళ్ళు పనులు చెబుతారు. ఇంకే దన్నా ఉద్యోగం చేసుకుంటే... ఈ వయసులో నాకెవరు ఉద్యోగం ఇస్తారు. ఇలా ఆలోచిస్తూ ఆయనలో ఆయన మధనపడుతుండగా... కోడల లక్ష్మి

"మావయ్యగారూ! పిల్లల్ని స్కూలు నుంచి తీసుకురండి" అని చెప్పి వెళ్లింది.

అది ఆయనకు ఆజ్ఞలా వినిపించింది. చొక్కా వేసుకుని పిల్లల్ని తేవడానికి వెళ్ళారు.

స్కూలునుంచి వచ్చిన పిల్లలు స్నానాలు చేసి అమ్మ పెట్టిన టిఫిన్ తిని, పాలు తాగి రామారావు దగ్గర కొచ్చి–

"తాతయ్యా! ఏదన్నా కథ చెప్పవూ" అని అడిగారు.

ఆయన కథ చెపుతుంటే ఆసక్తిగా వింటున్నారు.

"ఏమండీ! పనికిమాలిన కథలు చెప్పకపోతే వాళ్ళచేత హోంవర్క్ చేయించవచ్చుగదా" అంది పార్వతమ్మ.

రామారావు కథ చెప్పడం ఆపి పిల్లల్ని పుస్తకాలు తెమ్మని వాళ్ళతో హోంవర్క్ చేయించారు. తర్వాత కాసేపు నోటిలెక్కలు చెప్పారు. లెక్కలు బాగా రావాలంటే ఎక్కాలు రావాలి అని చెప్పారు. వాళ్ళకి స్కూల్లో చెప్పిన పాఠాలు చదివించారు.

పార్వతమ్మ పిల్లల్ని భోజనాలకి పిలిచారు. పిల్లలు పుస్తకాలు సర్దుకుని వెళ్ళిపోయారు.

రామారావు స్నానం చేసి, భోజనం ముగించి పడుకున్నారు. ఉదయం ఏడు గంటలకు మెలకువ వచ్చినా లేచి ఏం చెయ్యాలిలే అని మళ్లీ పడుకున్నారు.

"నాన్నగారూ! ఇవాళ వాకింగ్‌కి వెళ్ళలేదా?" అడిగాడు ఆనంద్.

"నేను వాకింగ్‌కెళ్ళకపోతే వచ్చే నష్టం ఏమీ లేదుగా. అందుకే వెళ్ళలేదు" అన్నారు.

"ఎన్నో సంవత్సరాలుగా అది మీ దినచర్యలో ఒక భాగం. అందుకే అడిగాను" అన్నాడు ఆనంద్.

## విముక్తి గీతం

కొత్తరాగమెత్తుకోవద్దు / నే సవర్ణుణ్ని కాను
అతి శూద్రుణ్ని అసలే కాదు
గుట్టుచప్పుడు కాని జీనోసైడ్
వెర్బల్ దాడి చెయ్యొద్దు
మీ నాలుగు స్థంభాలాటలో
నేనెప్పుడూ లేను.
పంగనామాలతో / పన్నగశయనులతో
నా డి.ఎన్.ఎ. సరిపోలదు.
ప్లీజ్! నా మతం మార్చొద్దు
అవసరానికి నన్నిట్లా / మీ చిట్టాలో చేర్చొద్దు.
నేనీ జంబూద్వీప మూలవాసిని
ఎత్తిన ఆయుధం కింద
మళ్ళీ మళ్ళీ శంభూకుణ్ని కాలేను.
వొంటిపై చర్మం వున్నవాణ్ణి
కుబుసం విడువడం తెలియనివాణ్ని
తరాలుగా నిప్పులో కాగి
తప్పెటగా ఖంగుమంటున్న వాణ్ని
ఎందుకు మళ్ళీ
దళిత గోవిందాల దగ్గరితనాలు
రహస్య వ్యూహాల కొత్త స్నేహాలు
ఆర్య ఫరో చెర నుండి
కనానుకు ప్రస్థానిస్తున్న వాణ్ని
కర్మ సిద్ధాంతాల సమాధి పెగల్చుకొని
పునరుత్థానమైన వాణ్ణి
చీకటి కోణాన్ని దాటి వచ్చిన గాయాన్ని
రెండవ రాకడకు అభిముఖంగా
నడుస్తున్న విముక్త గీతాన్ని
అతి శూద్రుణ్ని - ఆవకాయ జాడీని కాను.
నేనో అగ్ని పర్వతాన్ని / అర్థమైందా? ఆమెన్!

**–కె.బి.దేవిద్ లింగ్‌స్టన్**

## మబ్బుల చిత్రాలు

చిన్నప్పుడు చూస్తూ ఆడుకోడానికి
ఆకాశం నిండా అనేకానేక మబ్బుల చిత్రాలు–
ఒక్కోసారి.. ఒక్కో తీరున...
వేలాడదీసిన దూదిబొమ్మల్లా...
గాలిలో తేలిపోయే మంచుబొమ్మల్లా...
అందీ అందకుండాపోయే సెల్యులాయిడ్ చిత్రాలు!

○ ○ ○

సూర్యుడు నెత్తిమీదకొస్తే
మబ్బులకీ– కాస్త మబ్బు వదులుతుందేమో?
కొంత చలాకీగా గుర్రమెక్కి స్వారీచేస్తున్నట్టు...
ఏక శిల రథమై కదిలిపోతున్నట్టు... / పుష్పక
విమానమై గాలివెంట పరుగులు పెడుతున్నట్టు...
ఖండ ఖండాలుగా విడిపోయిన ప్రపంచంలా...
కళ్ళ నిండా మబ్బుల చిత్రాలు!

○ ○ ○

మబ్బుల చాటున చందమామనే కాదు
అప్పుడప్పుడు కొందరు మనుషులు తారసపడు
తుంటారు–/వాళ్ళు మబ్బునొదిలి... మత్తునొదిలి...
ఒళ్ళు విరుచుకుని ఆవులింతలు తీస్తున్నట్టుగానే
రాలిపోయిన ప్రేమల్ని చీకటి అంచుల్లో ఏరుకుం
టున్నట్టుగానే..
రూపాయి వేటకి కొత్త వలల్ని అల్లుకుంటున్నట్టు
గానే.../ మబ్బుల చాటున మనుషుల చిత్రాలు!

○ ○ ○

అప్పుడప్పుడు మబ్బులు మనుషుల్లా కనబడతాయి
క్రూరమృగాల్లా దర్శనమిస్తాయి... నిర్దాక్షిణ్యపు
నీడలవుతాయి!
ఇక మబ్బుల్ని చూస్తూ ఆడుకునేదెవ్వరు?
ఉరిమి చూస్తున్నప్పుడల్లా
కుట్రల కాలుష్యాల వాసన... నేలనంటిన నెత్తుటి
మరకలు / కాలాల వెంట కన్నీటి ఊట!
మబ్బులలో.. ఏ మనుషులలో...
చేతులు మాత్రం తడుస్తూనే–
భూమ్మీద ఎవరో నోరురాని పసిపాప ఏడుపు
దృశ్యాలన్నీ మటుమాయం– /కాలమూ మారింది...
అంతటా ఉరుకులు.. పరుగులు
మునుపటిలా మబ్బుల్ని చూస్తూ పలకరింతలు పోవాలని
నాకే కాదు ఏ పిల్లలకూ లేదు
అన్నీ మబ్బుపట్టిన మనసులే..!

–మోతుకూరి అశోక్‌కుమార్

"అన్నీ మనం అనుకున్నట్టు జరుగుతాయా? కొన్ని మనం మార్చుకోవాలి, తప్పదు" అన్నారు.

ఆయన మాటల్లోని గూడార్థం తెలియక, "సరే మీ ఇష్టం" అని వెళ్ళిపోయాడు ఆనంద్.

"ఏవండీ! వంట చేస్తుంటే మధ్యలో గ్యాస్ అయిపోయింది. బండ బుక్‌చేసి కూడా నాలుగు రోజులయింది. ఎందుకు తేలేదో, ఏంటో. రిక్షాలో వెళ్ళి తీసుకురండి" అంది పార్వతమ్మ.

ఆయన ఆ పని పూర్తిచేసి, వాలు కుర్చీలో పడుకుని ఆలోచనలో పడ్డారు.

ఇదంతా కాకతాళీయంగా జరుగుతోందా! కావాలనే చెపుతున్నారా? ఒక విధంగా కావాలనే పనులు చెబుతున్నట్టు అనిపిస్తోంది. రెండు రోజులుగా జీవితంలో ఏదో వెలితి కనిపిస్తోంది. అది ఇంట్లో పనులు చెప్పడం వలన వచ్చింది కాదు. వాళ్ళ ఆత్మీయతకి, అభిమానానికి దూరమైపోతున్నానేమో అనే భావం కలిగి మనశ్శాంతి లేకుండా పోయింది. స్నేహితులు చెప్పిన మాటలు ఆయనలో భయాన్ని కలిగిస్తున్నాయి. రెండు రోజులకే ఇలా ఉంటే ముందు ముందు జీవితం ఎంత భయంకరంగా ఉంటుందో... అనే ఆలోచన ఆయన్ని కలవరపెడుతోంది. ఒంటరిగా ఉంటే ఆలోచనలతో పిచ్చెక్కుతోంది. ఎలాగైనా దీనికి పరిష్కారం చూడాలి. అంటే ఉద్యోగం ఒక్కటే ఈ సమస్యకి పరిష్కారం. ఒకవేళ తెలిసినవారు ఎవరన్నా మొహమాటానికి ఉద్యోగం ఇచ్చినా తను చెయ్యగలడా! రోజులో ఐదు గంటలు పిల్లల మధ్య ఆటపాటలతో గడిపిన తాను నాలుగు గోడల మధ్య ఒక్కడిగా ఇరుకు కుర్చీలో కూర్చుని ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చెయ్యడం చాలా కష్టం. అది కాకుండా ఏదన్నా ప్రైవేట్ స్కూల్లో చేరితే! జీతం తక్కువైనా స్కూలు ఉద్యోగం కాబట్టి హాయిగా ఉంటుంది.

సాయంత్రం అవుతుండగా... బయటకు వెళ్ళి రెండు, మూడు స్కూళ్ళు తిరిగారు. వాళ్ళు రామారావుకు తెలిసినవారు కావడం వలన–

"రెండు రోజుల తర్వాత కనపడండి మాస్టారూ, విషయం చెపుతాం" అన్నారు.

ఆయన సంతోషంగా ఇంటికి వెళ్ళారు.

వారం తర్వాత ఉద్యోగం దొరికింది. మరుసటి రోజు వచ్చి చేరమన్నారు. రామారావు ఆనందానికి అవధి లేకుండా పోయింది. ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయారు. అలారం మోతకి ఉదయం లేచి

వాకింగ్‌కెళ్ళారు.

ఏడు గంటలకల్లా ఇంటికొచ్చి పేపర్ తీసి చదువు తుంటే...

"ఏమిటండీ! పేపర్ అబ్బాయిని చదవనీయొచ్చు కదా! మీరెలాగా 'ఖాళీ'నే" అంది పార్వతమ్మ.

"అది నిన్నటి వరకు. ఇప్పుడు నేను ఉద్యోగస్థుడ్ని.. నాకూ టైం అవుతోంది" అన్నారు రామారావు ఒకింత గాంభీర్యంగా.

అంతే.. పార్వతమ్మ, లక్ష్మి ఆయనవైపు ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు.

"అదేంటి నాన్నగారూ! మీకు ఈ వయసులో ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చుకదా" అన్నాడు ఆనంద్.

"లేదురా! పని లేకుండా ఇంట్లో ఉండాలంటే బోర్ కొడుతోంది. అదీగాక నలభై ఏళ్ళుగా ఉద్యోగానికి అలవాటుపడ్డ ప్రాణంగదా! అందుకే ప్రైవేట్ స్కూల్లో చేరాను" అన్నారు.

"మీ ఇష్టం. మీకేది నచ్చితే అది చేయండి. మీరు సుఖంగా ఉండడమే మా అందరికీ కావాల్సింది" అన్నాడు ఆనంద్.

ప్రైవేటు స్కూలు కావడంతో ఎనిమిదిన్నరకే రెడీ అయి వెళ్ళారు.

సాయంత్రానికి ఇంటికొచ్చిన ఆనంద్– తల్లి, భార్య కంగారు పడడం చూసి...

"ఏంటమ్మా! ఏం జరిగింది? అలా ఉన్నారు" అన్నాడు.

"ఏడు గంటలవుతున్నా నాన్నగారు ఇంటికి రాలేదురా! ఆలస్యం అయితే ఫోనన్నా చేసేవారు" అన్నారు.

"కంగారెందుకమ్మా! మొదటి రోజు వెళ్ళారు. అదీగాక ప్రైవేటు స్కూలు. వచ్చేస్తారులే"

"ఏమండీ, ఎంత ప్రైవేట్ స్కూలయినా ఆరు గంటలకి వదలకుండా ఉంటారా?" అంది లక్ష్మి.

"లక్ష్మీ... నాన్నగారు తిరిగి ఉద్యోగంలోకి వెళ్ళారంటే మీ ఇద్దరి ప్రవర్తన వల్లే అంటే కాదంటారా?" అని ప్రశ్నించాడు ఆనంద్.

"మేము! మేమేం చేశాంరా?" అంది పార్వతమ్మ.

"అవును. నాన్నగారు ఇన్ని సంవత్సరాలుగా ఉద్యోగం చేసి అటు పిల్లల అభివృద్ధి కోసం స్కూలులోను, ఇటు ఇంటిలో మనందరి కోసం అహర్నిశలు శ్రమించి... కొవ్వొత్తిలా ఆహుతి అవుతూ... మన జీవితాలలో వెలుగులు నింపారు. గరళాన్ని కంఠంలో అదిమిపెట్టిన శివునిలా... బాధలన్నీ గొంతులోనే అదిమిపెట్టి... తాను తిన్నా తినకపోయినా... మనకు కడుపు నింపారు. అక్కయ్యని, నన్ను చదవించడానికి ఎన్నో కష్టాలు పడ్డారు. అక్కయ్య పెళ్ళికి ఆయన ప్రావిడెంట్ ఫండ్ లోన్ తీసుకుని పెళ్ళి వైభవంగా జరిపించారు. నాకు ఉద్యోగం రావడానికి తెలిసిన వాళ్ళతో రికమండేషన్ చేయించారు. రిటైరయ్యాక ఆయన్ని సుఖపెట్టడానికి బదులు కష్టపెట్టారు.

ఏం లక్ష్మీ! పిల్లల్ని తీసుకెళ్ళడానికి రిక్షా అతను రాకపోతే నువ్వెళ్ళి దింపొచ్చుగదా! నీకు తీరిక లేకపోతే నేను వెళ్ళేవాడ్ని.

అమ్మా! నాన్నగారు పేపర్ చదువుతుంటే 'ఖాళీగా ఉన్నారు. అబ్బాయిని చదువుకోనీయండి' అన్నావు. గ్యాస్ అయిపోయిందని పంపావు. ఆ పని, ఈ పని చెప్పి ఆయనకు మనఃశ్శాంతి లేకుండా చేశారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఆయన మనకోసం కష్టపడ్డారు. ఇప్పుడు ఆయన్ని సుఖపెట్టాల్సిన బాధ్యత మనందరిదీ. అది మనం విస్మరించడం వల్లనే... ఆయన తిరిగి ఉద్యోగంలో చేరారు. ఇప్పటికైనా ఆయన మనసు తెలుసుకుని ప్రవర్తించండి. ఆ పనులు, ఈ పనులు చెప్పి ఆయన్ని కష్టపెట్టకండి. ఆయనంతట ఆయన చేస్తే ఫర్వాలేదు. ఆయన్ని ఈ వయస్సులో సుఖపెట్టడం మన బాధ్యత" అన్నాడు.

ఆనంద్ చెప్పిన మాటలు గుమ్మంలో అడుగు పెట్టిన రామారావు విన్నారు. కొడుకులోని మంచితనానికి పులకరించిపోయారు. వాడి మనసుని తెలుసుకోకుండా నెగెటివ్‌గా ఆలోచించినందుకు బాధపడ్డారు.

పార్వతమ్మ ఆయన్ను చూసి "నన్ను క్షమించండి. ఏదో పనుల వల్ల మిమ్మల్ని కష్టపెట్టను"

"మావయ్యగారు! మీరు నన్ను కూడా క్షమించండి" అంది లక్ష్మి.

"మనలో మనకు ఉండాల్సింది క్షమాపణలు కాదమ్మా... అనుబంధాలు, ఆత్మీయతలు. అవి నా పట్ల మీకున్నాయని ఇప్పుడే తెలుసుకున్నాను. పిల్లలూ రండర్రా! రేపు దీపావళి కదా! అందుకే మతాబులు, చిచ్చుబుడ్లు, టపాసులు, కొత్త బట్టలు తెచ్చాను.

ఒరేయ్ ఆనంద్! చిన్నప్పుడు మీ అమ్మ అన్నట్లు నువ్వు బంగారు కొండవేరా! అంతేకాదు నీలోని మంచి మనసుని అభినందిస్తున్నాను" అన్నారు రామారావు.

"పదండి! అందరం కలిసి భోజనం చేద్దాం" అన్నారు పార్వతమ్మ. ■